క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తు నేటితో ముగింపు

తెనాలిరూరల్: పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా దరఖాస్తు కావడానికి బుధవారం ఆఖరు రోజని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022లోగా పట్టభద్రులైన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



తెనాలి: స్థానిక అయితానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో ప్రతిభ గల విద్యార్థులను మంగళవారం ఘనంగా సత్కరించారు. చిత్రలేఖనం, నటనలో ప్రతిభను చాటుతున్న మాస్టర్ విష్ణువర్ధన్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో పాల్గొని ఫుట్‌బాల్ రాష్ట్రజట్టుకు ఎంపికైన హర్షవర్ధన్, 3వేల కి.మీ స్లో వాక్‌లో రాణిస్తున్న సుధారాణిని సత్కరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్.సునీత, నటుడు, దర్శకుడు దేవిశెట్టి కృష్ణారావు విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రసూనాదేవి, పీఈటీ శ్రీనివాస్, శారద, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ సర్వేను సక్రమంగా చేయండి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో జరుగుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ నైపుణ్య గణన సర్వేను సక్రమంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సచివాలయ ఉద్యోగులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని వ్యాపారుల వివరాలను సేకరించాలన్నారు. వాటిని యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఎటువంటి తప్పులు దొరలకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు రాజా, నరసింహులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో అన్నదానం



తెనాలి: పట్టణానికి చెందిన అక్కిశెట్టి జయలక్ష్మి ఆరో వర్ధంతి రోజైన మంగళవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జయలక్ష్మి భర్త అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన మాదల కోటేశ్వరరావు, సుంకర అమ్మనబాబు, కన్నెగంటి గోపీచంద్, కన్నెగంటి మాణిక్యాలరావు, యల్లంకి సాంబశివరావు, గోవాడ వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, దేవినేని సురేష్, సత్యనారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి పాల్గొన్నారు.

తెనాలి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 3,4 వార్డులలో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నూతక్కి విద్యార్థులు

నూతక్కి(మంగళగిరి): రాష్ట్రస్థాయిలో జరిగే వాలీబాల్ పోటీలకు నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల పీడీ కె.రజనీ నాయక్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీన జరిగిన అండర్ -14 బాలుర, బాలికల గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టుకు ముగ్గురు బాలికలు నూతక్కి నందు, నూతక్కి అనూహ్య, చాడవరపు నందుషాలు, ఇద్దరు బాలురు రావూరి కోటిసూర్య, బూరుగడ్డ జగన్‌లు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురం గ్రామంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ద్వితీయ సహస్రాబ్ది మహాకవి ఆలూరి బైరాగి

- అసంక్షుభిత గరళాన్ని మింగి కవితామృతాన్ని పంచాడు
- ఆధునికత వినాశనంపై నాడే హెచ్చరించిన కాలజ్ఞుడు
- శతజయంతి సంవత్సరం సందర్భంగా..



ఆలూరి బైరాగి

తెనాలి: మానవ జీవితంలో ఆధునికత వైపరీత్యాలను తాత్వికంగా వ్యతిరేకించిన తొలి తెలుగు కవి ఆలూరి బైరాగి. ఆయన వేదన మేధోజనిత వేదన కాదు. ఆ సంక్షోభాన్ని ఆయన అనుభవించారు. ఒక దోస్తావిస్కీ, ఒక కాఫ్కా, ఒక కిర్క్‌గార్డ్‌లా ఆయనిది స్వానుభవ సంవేదన. అసంక్షుభిత గరళాన్ని తాను మింగి కవితామృతాన్ని మనకు పంచాడు. అభివృద్ధి నెపంతో ఆధునికత సృష్టించే వినాశనాన్ని ముందే హెచ్చరించిన కాలజ్ఞుడు. ఆయన శతజయంతి సంవత్సరం సందర్భంగా...

ఆధునిక తెలుగు కవిత్వంలో తనదైన ముద్రతో ద్వితీయ సహస్రాబ్ది మహాకవి అనిపించుకున్న ఆలూరి బైరాగి, తెనాలి అయితానగర్‌లో 1925 సెప్టెంబరు 5న జన్మించారు. తండ్రి వెంకట్రాయుడు జాతీయాభిమానంతో హిందీ అక్షరాభ్యాసం చేయించారు. యలమంచిలి వెంకటప్పయ్య నడిపిన హిందీ పాఠశాలలో మధ్యమ చదివాడు. అప్పటికి బైరాగికి పదేళ్లు. ప్రజనందనశర్మ వద్ద రాష్ట్రభాష, విశారద పూర్తిచేశాడు. అప్పటికే పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిన బైరాగి కనిపించిన పుస్తకాన్నల్లా చదువుతూ వచ్చాడు. ఉన్నతవిద్య కోసమని 13వ ఏట ముజఫర్‌పూర్‌కు వెళ్లి నాలుగేళ్లు హిందీ, సంస్కృతం నేర్చుకున్నారు. అక్కడే తన 15వ ఏట తొలిసారిగా హిందీ కవిత రాసి, జాతీయ కవిసమ్మేళనంలో ప్రశంసలు పొందారు. 1941లో తిరిగొచ్చారు. తన 17వ ఏట తల్లి సరస్వతి మరణం ఆయన్ను కుంగదీసింది. క్విట్‌ఇండియా ఉద్యమంలో పనిచేశాడు. ఎంఎస్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ నేతలతో పరిచయాలు బైరాగి జీవితంలో కీలక మలుపు. మార్క్సిస్టు తత్వశాస్త్రం, ఎంఎస్ రాయ్ సిద్ధాంతాలు బైరాగిని ఒక విలక్షణమైన దార్శకునిగా తీర్చిదిద్దాయి. ఇరవై ఏళ్లకే తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ భాషల్లో పాండిత్యాన్ని సాధించాడు బైరాగి. 1946లో ప్రత్తిపాడు హైస్కూలులో హిందీ ఉపాధ్యాయుడిగా చేరాడు. అక్కడి నుంచే తన తెలుగు కవితా సంకలనం 'చీకటి నీడలు' వెలువరించాడు. సినీనిర్మాత, తన పినతండ్రి చక్రపాణి ఆహ్వానంతో చెన్నైకు వెళ్లాడు. హిందీ 'చందమామ' సంపాదకుడిగా మరో మజిలీ. అప్పుడే హిందీ కవితా సంకలనం 'పలాయన్' తెచ్చాడు. తెలుగులో రాయని వైయుక్తికమైన ప్రేమ కవిత్వాన్ని ఆయన హిందీలో అద్భుతమైన సౌందర్య దృష్టిలో వెలువరించారు. స్వేచ్ఛాప్రియుడైన బైరాగి, ఆ పత్రిక నుంచి కొద్దికాలానికే బయటకొచ్చారు.'నూతిలో గొంతుకలు' కవితా సంకలనంతో మానవ సహజ వేదనకు గాఢమైన అభివ్యక్తిని ఇచ్చాడు. 'దివ్యభవనం' కథా సంపుటిని తీసుకొచ్చాడు.

మహాజలపాతం వంటి పదగుంభనం, అనన్యమైన భావోద్వేగం, అనితరసాధ్యమైన ధారాశుద్ధి కలిగిన బైరాగి, ఎప్పుడూ సమూహంలో ఒంటరిగానే ఉండేవాడు. జీవితాన్ని వివిధ కోణాల్లో చూశాడు. సమాజంలోని పీడిత, తాడిత ప్రజల బాధామయ జీవిత గాధలను తన కవిత్వపు ప్రతి పంక్తిలోనూ జీవింపజేశాడు. తనకంటూ ప్రత్యేకంగా నిర్మించుకున్న సాహితీ జగత్తులోనే నివసించాడు.

రెండో ప్రపంచ యుద్ధంలో విపరీతంగా జరిగిన జననష్టంపై స్పందించిన బైరాగిలోని కవి హృదయం, 'ఈ హత్యలకై జవాబు ఏ ద్రోహుల నడ గాలో' అంటూ పలికింది. అదే దశలో తెలుగునాట కవితా ధోరణుల్లో వచ్చిన భావవిప్లవ జ్వాలకు ప్రభావితుడైన కవుల్లో బైరాగి కూడా ఉన్నారు. ఏ ఒక్క అనాచారమూ, అనర్థమూ ఆయన దృష్టిని తప్పుకోలేదు. అవినీతి, అక్రమాలతో నిండిన ఈ జీవితపు చీకటి నుంచి ఆకాశపు వెలుతురులోకి చొచ్చుకుపోయే విహంగ స్వేచ్ఛ బైరాగి జీవితం. ఆయన కవిత్వమంతటా చీకటి, తుఫాన్, విధ్వంసం, నెత్తురు అలుముకున్నాయి.

పీడిత జనావళికి ప్రతినిధిగా బైరాగి వెలువరించిన గ్రంథాలు తక్కువే. అవే ఆయన్ను తెలుగు, హిందీ సాహిత్యంలో ధ్రువతారగా నిలిపాయి. ఆయన రాసిన 'ఆగమగీతి' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'చీకటి నీడలు', 'నూతిలో గొంతుకలు' తెలుగు కవితా సంకలనాలు. హిందీ కవితా సంకలనం 'పలాయన్'. తెలుగు కథాసంకలనాలు 'దివ్యభవనం', 'త్రిశంకు స్వర్గం'. తెలుగులో ఆధునిక కవిత, ప్రముఖ ఆధునిక కవితల హిందీ కావ్యానువాదం.. ఇంకా అనేక కవితలు ప్రచురితమయ్యాయి.'నాక్కొంచెం నమ్మకమివ్వు' కవిత బాగా పేరు తెచ్చింది. దీనిని శ్రీశ్రీ ఇంగ్లిష్‌లోకి అనువదించారు.

సాహితీ సమాజంలో ఎంతగా ఎదిగినా బైరాగి జీవితాన్ని చాలా నిరాడంబరంగా గడిపారు. కవిత్వం, కథలు, వ్యాసాలతో వచ్చే ఆదాయంతోనే కాలక్షేపం చేశాడు. అతడి ముగ్గురు సోదరులు ఎదిగి వచ్చి, బైరాగి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడినా, ఎందుచేతనో ఒంటరిగానే జీవించాడు. ఆరోగ్యం క్షీణించినా ఆహార నియమాలు పాటించలేదు. 1978 సెప్టెంబరు 9న మరణించాడు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తెనాలి: స్థానిక కేఏస్ మున్సిపల్ హైస్కూలులో ఈనెల 2-4 తేదీల్లో జరిగిన 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అంతరజిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటిన కొత్తపేటలోని రావి సాంబయ్య మునిపల్ బాలుర హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులను మంగళవారం సాయంత్రం అభినందించారు. తమ విద్యార్థిని దనాల తను 81 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు తెలియజేశారు. మరో ఎనిమిదిమంది విద్యార్థులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను పొందినట్టు చెప్పారు. 40 కిలోల విభాగంలో మునిపల్లి వర్షితప్రియ, బాణావత్ ఇంద్రనాయక్, 55 కిలోల్లో పాలపర్తి లక్ష్మీప్రసన్న, వై.తరుణ్, 64 కిలోల్లో ఎస్‌కే ఆస్మాబేగం, 67 కిలోల్లో లీల నాగేంద్రబాబు, 89 కిలోల విభాగంలో దమ్ము తేజ, 102 ప్లస్ కేటగిరిలో స్వామినాయక్‌లు ఉన్నట్టు తెలియజేశారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో బాధ్యతాయుత స్పందన

సచివాలయ సిబ్బందితో మంత్రి మనోహర్ సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: సచివాలయాల సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో త్వరితగతిన స్పందించాలని స్పష్టంచేశారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మంగళవారం నియోజకవర్గంలోని వార్డు/గ్రామ సచివాలయాల సిబ్బందితో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి మంత్రి మనోహర్ అధ్యక్షత వహించారు. ఒక సమస్యతో ప్రజలు సచివాలయానికి వచ్చినప్పుడు, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సత్వరం స్పందించిన మెరుగైన సేవలనందిస్తే, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ప్రజలకు బాధ్యతగా సేవ చేయాలని కోరారు. గ్రామ, వార్డు స్థాయి సచివాలయాలు, ప్రజా సమస్యలపై స్పందించకుంటే, మండల స్థాయి, డివిజన్ స్థాయి, కలెక్టర్ స్థాయి గ్రీవెన్స్ లకు సమస్యల అర్జీలు సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీన అందించే పెన్షన్లను మొదటి రోజునే 99 శాతం వరకు సచివాలయ సిబ్బంది ద్వారా అందించడం గొప్ప మార్పుగా వ్యాఖ్యానించారు. శాఖలవారీగా సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ, డీఎస్పీ బి.జనార్ధనరావు, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి శేషన్న మాట్లాడారు.

త్యాగమయి కల్లూరు తులశమ్మ

- నేటితరానికి స్ఫూర్తిప్రదాత
- కాంస్య విగ్రహావిష్కరణ సభలో మంత్రి నాదెండ్ల మనోహర్



విగ్రహావిష్కరణలో నాదెండ్ల మనోహర్, ఆలపాటి రాజా, డాక్టర్ దక్షిణామూర్తి, రవీంద్రనాథ్

తెనాలి: తెనాలి ప్రాంతానికి కీర్తప్రతిష్టలు తీసుకొచ్చిన త్యాగధనులను స్మరించుకుంటూ వారినుండి స్ఫూర్తిని పొందటం నేటితరం కర్తవ్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అలాంటి మహానుభావుల్లో స్వాతంత్ర్యయోధురాలు కల్లూరు తులశమ్మ ఒకరని గుర్తుచేశారు. రూరల్ మండల గ్రామం పెదరావూరుకు చెందిన స్వాతంత్ర్యయోధురాలు కల్లూరు తులశమ్మ కాంస్య విగ్రహాన్ని ఆ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేశారు. మంగళవారం సాయంత్రం ఆ విగ్రహాన్ని మంత్రి మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. సభకు చైతన్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన ప్రసంగంలో, భావోద్యమాలకు నిలయమైన తెనాలిలోని గాంధేయవాదుల్లో తులశమ్మ ఆణిముత్యమని చెప్పారు. పెదరావూరు నుంచి ఎందరో మహిళలు స్వరాజ్య ఉద్యమం, ఖద్దరు ప్రచారంలోనూ, భారతీదేవి రంగా నేతృత్వంలో కల్లుమానండోయ్ ఉద్యమంలోనూ పాల్గొన్నారని చెప్పారు. చరిత్ర నుంచి యువతరం స్ఫూర్తిని పొందాలని చెప్పారు. ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ తన ప్రసంగంలో తులశమ్మ జీవిత విశేషాలను తెలియజేశారు. శాఖమూరి తిమ్మానాయుడు స్వాగతం పలికారు. 'గాంధేయ మహిళ కల్లూరు తులశమ్మ స్మృతి సంచికను మంత్రి మనోహర్ ఆవిష్కరించారు. విగ్రహ కమిటీ సభ్యులను, విగ్రహ శిల్పి అక్కల శ్రీరామ్‌ను అతిథుల చేతులమీదుగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ కాకి జయప్రద, మారౌతు సీతారామయ్య, కొడాలి పూర్ణచంద్రరావు, కొడాలి రమణబాబు, అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ జట్టుకు ఆముక్త



అకాడమీ కోచ్, సహ శిక్షకులతో ఆముక్త

తెనాలి: పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపల్ హైస్కూలులో ఈనెల 2-4 తేదీల్లో జరిగిన అంతర జిల్లాల స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండల గ్రామం శిరిపురంకు చెందిన ఆముక్త కాసరనేని అద్భుత ప్రతిభను చాటింది. జాతీయ పోటీల్లో ఆడనున్న ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టుకు ఎంపికైంది. రాష్ట్ర బాలుర జట్టుకు ఎంపికైన జయరాం, ఆర్యామన్‌తోపాటు ఆముక్త విశాఖపట్టణంలోని సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. అంతర జిల్లాల పోటీల్లో విశాఖపట్టణం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆముక్త జాతీయపోటీల్లోనూ ప్రతిభను చాటి అంతర్జాతీయ పోటీలకు హాజరవాలనే కోర్కెను వెల్లడించింది. అకాడమీ కోచ్ ఆర్.సునీల్‌రెడ్డి ఆముక్త, జయరాం, ఆర్యామన్‌ను అభినందించారు.

అలిగి బయటకొచ్చి.. క్షేమంగా గూటికి చేరి...



బాలుడిని మేనత్త ఈశ్వరమ్మకు అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటాద్రి

తెనాలిరూరల్: అలిగి ఇంటి నుంచి వచ్చేసిన మైనర్ బాలుడిని జీఆర్పీ పోలీసులు గుర్తించి బంధువులకు అప్పగించారు. తెనాలి జీఆర్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ జి. వెంకటాద్రి వివరాలు వెల్లడించారు. నెల్లూరుకు చెందిన 14 ఏళ్ల పర్వతం పండు తలిదండ్రులు గతంలోనే మరణించారు. నెల్లూరులోనే మేనత్త గౌరమ్మ పెంచుతోంది. మార్కులు సరిగ్గా రాకపోతుండడంతో బాగా చదువుకోవాలని ఆమె మందలించింది. దీంతో అలిగి ఇంటి నుండి వచ్చి రైలులో తెనాలి చేరుకున్నాడు. ప్లాట్‌ఫాంపై ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని జీఆర్పీ పోలీసులు గుర్తించి స్టేషనుకు తీసుకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గుంటూరులో మరో మేనత్త సిరిగిరి ఈశ్వరమ్మ ఉందని చెప్పడంతో వారి ఆచూకీ గుర్తించి సమాచారం అందించారు. జీఆర్పీ స్టేషన్‌కు పిలిపించి వారి వివరాలు, ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేసుకుని బాలుడిని అప్పగించారు.

పత్తి లోడు ట్రాక్టర్ బోల్తా

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు పత్తి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పొనుగుపాడు గ్రామానికి చెందిన రైతులు పత్తిని ట్రాక్టర్‌పై లోడు చేసుకుని గుంటూరు వైపునకు తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని కట్టెల అడితీల సమీపంలో ప్రధాన రహదారిపై బోల్తా పడింది. రోడ్డుపై ఓ వ్యక్తి అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదం చోటు చేసుకుంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని చెబుతున్నారు.

శోభాయమానంగా నాగుల చవితి పూజలు



అంగలకుదురులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఎరుకలపూడిలోని శ్రీనవదుర్గాంబికా సమేత అమర నాగ లింగేశ్వరస్వామి ఆలయంలో...



తెనాలి శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో భక్తజనసందోహం



కొల్లిపర మండలంలో నాగుల పుట్ట వద్ద ...



సంగంజాగర్లమూడి శ్రీసంగమేశ్వరాలయంలో..



వైకుంఠపురం దేవస్థానంలో పాలుపోస్తున్న...

తెనాలి: పవిత్రమైన కార్తిక మాసంలో నాగుల చవితి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణ, పరిసరాల్లోని వివిధ ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలను వెలగించిన భక్తులు, నాగుల చవితి కావటంతో పుట్టలో పాలు సమర్పించి నాగేంద్రునికి పూజలు చేశారు. స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తిక దీపారాధనలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద నాగేంద్రస్వామి పాలు, పండ్లు, చలిమిడి సమర్పించారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన గంగానమ్మపేటలోని శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. దేవస్థానంలోని తోట ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి అక్కడి అక్కడే పుట్ట వద్ద పాలు సమర్పించి నాగేంద్రస్వామికి పూజలు చేశారు. శ్రీరామేశ్వరస్వామి దర్శనానికి ఉచిత/ప్రత్యేక అభిషేకాల క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. శ్రీరామేశ్వర స్వామికి తెల్లవారుజాము నుంచి అభిషేకాలతో పూజాకార్యక్రమాలు ప్రారంభించారు. ఆలయ ఈవో వీవీ రమణకుమారి పర్యవేక్షించారు.

మారీసుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరీసమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలోనూ ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నాగేంద్రునికి పాలాభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నాగేంద్రస్వామి పుట్ట వద్ద పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సుల్తానాబాద్‌లోని శ్రీ గంగాకాశీ అన్నపూర్ణేశ్వరీసమేత శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి పూజలు ఘనంగా చేశారు. స్థానిక సుల్తానాబాద్‌లోని ఆలపాటినగర్‌లో గల శ్రీసద్గురు సాయికుమార్ మందిరంలో నాగుల చవితి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని పుట్ట వద్ద ఉదయం నుంచి మహిళలు పూజలు చేశారు. అక్కడే దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగేంద్రునికి పాలు, చలిమిడి సమర్పించారు. పినపాడులో పురాతన ప్రసిద్ధ శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నాగుల చవితి పూజలు వైభవంగా జరిగాయి. నాగ ప్రతిమల వద్ద దీపారాధనలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని శ్రీబాలత్రిపుర సుందరీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి దేవస్థానంలో నాగులచవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సంగమేశ్వర స్వామికి విశేష అభిషేకాలు చేశారు. నాగేంద్రుని పుట్టలో పాలు సమర్పించి పూజలు చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త మాణిక్యరావు సిద్ధార్ధ వెంకట మార్కండేయరావు నేతృత్వంలో కార్యనిర్వాహణాధికారి వి.పద్మ పర్యవేక్షించారు. అంగలకుదురు గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి నాగేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు ఆలయం వద్ద పుట్టలో పాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎరుకులపూడి గ్రామంలోని నవదుర్గాంబికా సమేత అమర నాగ లింగేశ్వర స్వామి దేవాలయంలోనూ వైభవంగా పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. నాగేంద్రునికి విశేష అలంకరణలు చేసి పూజలు జరిపారు.

కొల్లిపరలో....

కొల్లిపర: నాగుల చవితి పర్వదినాన్ని మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, అత్తోట, చివలూరు. తూములూరు గ్రామాలలోని ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని భక్తులు నాగుల పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పసుపు, కుంకుమ, ఆవుపాలతో పూజలు నిర్వహించారు. పలు దేవాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి, నాగేంద్రుని విగ్రహాలకు భక్తులు క్షీరాభిషేకం చేశారు.

పౌరాణిక కళాకారుడు జగన్‌కుమార్‌కు సంస్మరణ



తెనాలి: ఇటీవల అకాల మరణం చెందిన సుప్రసిద్ధ రంగస్థల నటుడు మున్నంగి జగన్‌కుమార్ సంస్మరణ సభను మంగళవారం సాయంత్రం సమతాజ్యోతి సంగీత కళాసేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని చిట్టిఆంజనేయస్వామి సెంటరులో రిగిన సంస్మరణకు సభకు ఆర్‌అండ్‌బీ రాజు అధ్యక్షత వహించారు. మున్నంగి జగన్‌కుమార్ కళాసేవను, పౌరాణిక పాత్రల్లో ఆయన కళాప్రతిభను వక్తలు కొనియాడారు. సీహెచ్ సీతారామయ్య, వేము రామరాజు, ఎం.రామలింగేశ్వరుడు, ఆరాధ్యుల ఆది నారాయణ, సీహెచ్‌వీఎస్ఎస్ ఫణికుమార్, కనపర్తి సింగయ్య, చెన్నం సుబ్బారావు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.వెంకటరెడ్డి



వీరనారీమణి మీనాకుమారి, వైఎల్ నారాయణ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి: మాజీ సైనికులు తమ సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి సూచించారు. మాజీ సైనికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై అందరూ అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని చెప్పారు. అంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెనాలి డివిజన్ మాజీ సైనికోద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని స్థానిక కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు నారాయణం కమల్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి ఆర్.గుణశీల మాట్లాడుతూ మాజీ సైనికులకు ప్రభుత్వం తరపున కల్పించే సదుపాయాలపై అవగాహన కల్పించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు, చెరుకుపల్లి అసోసియేసన్ అధ్యక్షుడు టి.సుబ్బారావు, భారతీయ స్టేట్ బ్యాంక్ తెనాలి చీఫ్‌మేనేజర్ పి.వాసుదవేరావు మాట్లాడారు. సమ్మేళనంలో 12 మంది విశ్రాంత సైనికులు, వీరనారీమణులు, నలుగురు ఉత్తమ విద్యార్థులను ముఖ్యఅతిథి చేతులమీదుగా సత్కరించారు. తెనాలి డివిజన్ సంఘ అధ్యక్షుడు కనపర్తి మహారాజు, ఉపాధ్యక్షుడు ఎండీ ఫరీద్, కార్యదర్శి పి.సురేష్‌కుమార్, కోశాధికారి కేవీ శంకరరావు, సంఘ సభ్యులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు రానివ్వకండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: చిన్నారులు, గర్భిణులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. పట్టణంలోని నందులపేట, సాలీపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆశా డే సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు సమావేశంలో పాల్గొనడం జరిగిందన్నారు. పిల్లల్లో సంభవించే నిమోనియా శ్వాస వ్యాధులు రాకూండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భనిర్ధారణ పరీక్ష కిట్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే వారి వివరాలకు ఆశా యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ డి.సుబాష్ రమాదేవి, డాక్టర్ దివి కిషోర్ కుమార్, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, లెప్రాసీ విభాగ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా, ఫైలేరియా ఉద్యోగులు జి.రవికుమార్, శ్రీకంత ఉమాకాంత్, శివగణేష్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.